


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.L.L.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 25-01-2023 సంపుటి : 04 సంచిక : 135 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఏపీ హైకోర్టు: జీవోనెం. 1పై వాదనలు పూర్తి..

### తీర్పు రిజర్వ్‌లో ఉంచిన చీఫ్ జస్టిస్



అమరావతి: ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 1కి వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైన సంగతి తెలిసిందే.ఆ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వాదనలు ముగిశాయి. మంగళవారం వాదనలు పూర్తికావడంతో.. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా.ఇక జీవో నెంబర్ 1 పై సస్పెన్షన్‌ను కొనసాగించాలని టీడీపీ తరపు న్యాయవాది.. హైకోర్ట్ బెంచ్‌ను కోరారు. అయితే అందుకు ధర్మాసనం నిరాకరించింది. అంతకు ముందు రోజు వాదనల సందర్భంగా.. చీఫ్ జస్టిస్, వెకేషన్ బెంచ్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే..రోడ్‌షోల మీద, ర్యాలీల మీద సర్కార్ ఎలాంటి నిషేధం విధించలేదని, నడి రోడ్డు మీద భారీగా జనాన్ని సమీకరించవద్దని మాత్రమే చెప్పిందని, ప్రజా రక్షణకు సంబంధించి ప్రభుత్వానికే పూర్తి అధికారమని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని హైకోర్టు సీజే గుర్తు చేశారు. అలాగే.. చంద్రబాబు సభల్లో 8 మంది చనిపోయిన దృష్ట్యా సర్కారు జీవో తెచ్చిందని ప్రస్తావించారు.

## మోదీపై బీబీసీ డాక్యుమెంటరీ.. అమెరికా స్పందన ఇదే



వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్రమోదీపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ వివాదం రాజేసింది. దీనిపై కేంద్రం నుంచి తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తమైంది.'మీరు చెప్తున్న డాక్యుమెంటరీ గురించి నాకు తెలియదు. రెండు శక్తిమంతమైన ప్రజాస్వామ్యాలుగా అమెరికా, భారత్‌కు వాటి భాగస్వామ్య విలువల గురించి బాగా తెలుసు. భారత ప్రజాస్వామ్యం శక్తిమంతమైది. ఈ రెండు దేశాలను కలిపి ఉంచే వాటిపై మా దృష్టి ఉంటుంది. అలాగే ఈ బంధాన్ని బలోపేతం చేసే అంశాల గురించి మేం ఆలోచిస్తాం. ఇరు దేశాల మధ్య సన్నిహిత రాజకీయ సంబంధాలు, ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. అమెరికా, భారత్ ప్రజల మధ్య విడదీయరాని బంధం ఉంది' అంటూ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి నెడ్ ప్రైస్‌విలేకరుల సమావేశంలో తెలిపారు. దీనిపై ఇదివరకు బ్రిటన్‌పధాని రిషి సునాక్ కూడా ఇదే తరహాలో స్పందించారు. ఆ డాక్యుమెంటరీ వివాదం నుంచి దూరం జరిగారు. అందులోని విషయాలను తాను పూర్తిగా అంగీకరించలేనని వెల్లడించారు.2002 గుజరాత్ అల్లర్లపై 'ఇండియా.. ది మోదీ క్వశ్చన్' పేరిట బీబీసీ డాక్యుమెంటరీని రూపొందించింది. దానిని భారత్(ఎనిటతిజీ)తీవ్రంగా ఖండించింది. అదొక విద్వేషపూరిత చర్యగా అభివర్ణించింది. విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి మాట్లాడుతూ.. 'ఇది ఒక ప్రచార కార్యక్రమం. వారు ఎంచుకున్న కోణాన్ని ప్రచారం చేయడానికి మాత్రమే దీన్ని రూపొందించారు' అని వ్యాఖ్యానించారు.ఈ డాక్యుమెంటరీ వివాదాస్పదమైన నేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు చేయాలంటూ యూకేలో ఆన్‌లైన్ పిటిషన్ దాఖలైంది. గత వారం ప్రసారమైన మొదటి భాగంలో దుష్ప్రచారం ఎక్కువగా ఉందని, వీక్షకులను తప్పుదోవ పట్టించేలా ఉందని, నిర్దిష్ట ప్రమాణాలను పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. మంగళవారానికి నిర్దేశించిన రెండో భాగం ప్రసారాన్ని నిలిపివేయాలని అభ్యర్థించారు.

## గుడ్‌న్యూస్ చెప్పిన ఆర్‌బీఐ.. గడువు పొడిగించింది




ముంబై: సవరించిన సేఫ్ డిపాజిట్ లాకర్ల ఒప్పందాలను కస్టమర్లతో బ్యాంక్‌లు కుదుర్చుకోవాల్సి ఉండగా, ఇందుకు ఈ ఏడాది చివరి వరకు గడువును ఆర్‌బీఐ పొడిగించింది.సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా లాకర్ల ఒప్పందాల్లో మార్పులు చేసి, వాటిపై కస్టమర్ల సమ్మతి తీసుకోవాలంటూ 2021 ఆగస్ట్‌లోనే ఆర్‌బీఐ అన్ని బ్యాంక్‌లను కోరింది. "పెద్ద సంఖ్యలో కస్టమర్లు నవీకరించిన లాకర్ ఒప్పందాలపై సంతకాలు చేయాల్సి ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది.గడువులోపు (2023 జనవరి 1 నాటికి) లాకర్ ఒప్పందాలను తిరిగి కుదుర్చుకోవాలంటూ కస్టమర్లకు చాలా వరకు బ్యాంక్‌లు తెలియజేయలేదు. కనుక 2023 ఏప్రిల్ 30 నాటికి లాకర్ ఒప్పందాలను తిరిగి కుదుర్చుకోవాల్సిన విషయాన్ని కస్టమర్లకు బ్యాంక్‌లు విధిగా తెలియజేయాలని కోరాం. జూన్ 30 నాటికి కనీసం 50%, సెప్టెంబర్ 30 నాటికి కనీసం 75% కస్టమర్లతో ఒప్పందాలు చేసుకోవాలి. ఒప్పందం కాపీని కస్టమర్‌కు అందించాలి" అని తాజా ఆదేశాల్లో ఆర్‌బీఐ పేర్కొంది. జనవరి 1 నాటికి ఒప్పందాలు చేసుకుని లాకర్‌లను స్తంభింపజేస్తే, వాటిని తిరిగి విడుదల చేయాలని ఆదేశించింది.

## సర్జికల్ స్ట్రయిక్స్‌పై ఆధారాలు అక్కర్లేదు: రాహుల్ గాంధీ




జమ్మూ: యురి ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం పాక్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ చేసిన విషయం తెలిసిందే. అయితే బీజేపీ సర్కార్ అన్ని అబద్ధాలు చెబుతోందని, సర్జికల్ స్ట్రయిక్స్ చెందిన ఆధారాలు చూపించడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ ఆరోపించారు. ఆ వివాదాస్పద వ్యాఖ్యలను ఇవాళ రాహుల్ గాంధీ ఖండించారు. జమ్మూలో భారత్ జోడో యాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దిగ్విజయ్ వ్యాఖ్యలతో విభేదిస్తున్నట్లు తెలిపారు. దిగ్విజయ్‌వి అర్ధరహిత వ్యాఖ్యలు అని రాహుల్ అన్నారు. దిగ్విజయ్ వ్యాఖ్యలను తాము వ్యతిరేకిస్తున్నామని, పార్టీ అభిప్రాయాలు.. దిగ్విజయ్ అభిప్రాయాల కన్నా ముఖ్యమైనవని రాహుల్ అన్నారు.చర్చల ద్వారా పార్టీ అభిప్రాయాలు ఉత్పన్నం అవుతాయని, కానీ దిగ్విజయ్ వ్యాఖ్యలు ఆయన స్వంత అభిప్రాయాలని, ఆ అభిప్రాయాలకు పార్టీతో సంబంధం లేదని, సైనిక దళాల పనితీరు విషయంలో తాము స్పష్టమైన వైఖరితో ఉన్నామని, ఆ దళాలు అసాధారణ రీతిలో పనిచేస్తున్నాయని, వాళ్ల ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ తెలిపారు. సోమవారం భారత్ జోడో యాత్రలో పాల్గొన్న దిగ్విజయ్.. సర్జికల్ స్ట్రయిక్స్‌పై కామెంట్ చేశారు. దీంతో ఆ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి.ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ నష్టనిరవారణ చర్యలు చేపట్టారు.జమ్మూకశ్మీర్‌లోని యురి బేస్‌పై 2016లో ఉగ్రవాదులు దాడి చేశారు. ఆ దాడిలో 18 మంది సైనికులు చనిపోయారు. ఆ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. 2019లో పుల్వామాలో భారత సైనిక కాన్వాయ్‌పై ఉగ్రవాదులు అటాక్ చేశారు. పాక్‌లోని జైషే గ్రూపు ఆ దాడి చేసింది. ఆ దాడి తర్వాత భారత సైన్యం .. పాక్‌లోని బాలాకోట్‌పై వైమానిక దాడులు చేసింది.

## సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన యూపీ సీఎం స్పెషల్ అడ్వైజర్



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని.. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారు కలిశారు.మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో.. సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు యూపీ సీఎం స్పెషల్ అడ్వైజర్ సాకేత్ మిశ్రా.ఇక తాజాగా ఏపీ సీఐడీ కొత్త డీజీగా నియమితులైన ఎన్.సంజయ్ సైతం ఇవాళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


## ఆరోగ్య శ్రీ రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదు

### జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు




కర్నూలు, జనవరి24 :ఆరోగ్య శ్రీ రోగుల నుండి డబ్బులు వసూలు చేసి వైద్యం చేస్తున్నారనే ఫిర్యాదులు ఏ ఒక్క ఆసుపత్రి మీద వచ్చినా సహించే ప్రసక్తే లేదని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంబంధిత ఆస్పత్రుల యాజమాన్యాలను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఆరోగ్యశ్రీ అమలుపై సంబంధిత వైద్యాధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు.అయినప్పటికి కూడ జిల్లాలో ఉన్న 9 ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ రోగుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు రావడం పట్ల జిల్లా కలెక్టర్ ఆస్పత్రి యాజమాన్యాల పట్ల అసహనం వ్యక్తం చేశారు...ఇలాంటి ఫిర్యాదులు రావడం వల్ల అంతిమంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అదే విధంగా డబ్బు వసూలు చేసిన 9 ఆస్పత్రుల వాళ్ళు రిఫండ్ చేసినప్పటికీ కూడ రెండు సార్లు పెనాల్టీ వేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ ను ఆదేశించారు. ఇక మీదట అయినా ఆస్పత్రి యాజమాన్యాలు మరల ఇటువంటి ఫిర్యాదులు రాకుండా, ఆరోగ్య శ్రీ రోగులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## వాణిజ్య పన్నుల విభాగంలో నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు



అమరావతి: వాణిజ్య పన్నుల విభాగంలోని నలుగురు ఉద్యోగులపై ఏపీ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. మీడియా కథనాలు, వ్యక్తిగత ఫిర్యాదులపై విచారణ కమిటీ నివేదిక మేరకు చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.కమిటీ నివేదిక ఆధారంగా ఏసీటీవోలు ప్రసాద్, మెహర్ కుమార్, సంధ్య, గడ్డం ప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గిరిజా శంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదేశాలు ఇచ్చారు. ఉద్యోగ వర్గాల్లో నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్ కలకలం రేపుతోంది.

## తెలంగాణలో ఎవరైనా పొత్తుకు వస్తే సంతోషం: పవన్ కల్యాణ్

నాచుపల్లి: తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ క్లారిటీ ఇచ్చారు. రాజకీయ భవిష్యత్‌పై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.జగిత్యాల జిల్లా నాచుపల్లిలో ఏర్పాటు చేసిన జనసేన తెలంగాణ కార్యనిర్వాహకుల సమావేశంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజారాజ్యం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "తెలంగాణ పోరాటాల గడ్డ. దేశంకంటే రెండేళ్లు ఆలస్యంగా తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చింది. నేను ఆశయం కోసం పోరాడుతున్నా. తెలంగాణ ప్రజలకు సందేశం ఇచ్చే స్థాయిలో నేను లేను. తెలంగాణ ప్రజల నుంచి నేర్చుకునే స్థాయిలో ఉన్నా. అప్పట్లో వైఎస్ ప్రభుత్వం ఎలా వ్యవహరించిందో మీకు తెలుసు. అప్పటి కాంగ్రెస్ నేతల తీరు వల్లే పరుషంగా మాట్లాడాల్సి వచ్చింది" అని పవన్ కల్యాణ్ వివరించారు.తెలంగాణలో భాజపాతో పొత్తు ఉండదు, కానీ నా మద్దతు ఉంటుంది. పరిమిత సంఖ్యలోనే పోటీ చేస్తాం. 25 నుంచి 40 అసెంబ్లీ స్థానాలు, 7 నుంచి 14 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధం. పోటీ చేయని స్థానాల్లో కూడా జనసేన ప్రభావం చూపాలి. తెలంగాణలో కచ్చితంగా పర్యటిస్తా. ఇక్క డకూడా ఎవరైనా పొత్తుకు వస్తే సంతోషం. మన భావజాలానికి దగ్గరగా వస్తేనే ఓకే.. అది భాజపా అయినా సరే. నాది కొత్త పార్టీ.. నేతలు కూడా కొత్త వారే. ఇక్కడ మైనింగ్ దోపిడీ జరుగుతోంది. ప్రజాక్షేత్రంలో ఉండి పోరాడాలి. తెలంగాణలో చిన్న పోలీసు ఉద్యోగానికి ఇన్ని పరీక్షలా? మరి ప్రజాప్రతినిధులకు ఎన్ని పరీక్షలు ఉండాలి? చాకలి ఐలమ్మ పోరాటం వల్లే జై తెలంగాణ అంటున్నాం. నేను తిట్లు తినడానికి, వీధి పోరాటాలకైనా సిద్ధం. ఆంధ్రప్రదేశ్‌లో కంటే తెలంగాణలో పాలన బెటర్. తెలంగాణ, ఏపీ సమస్యలు వేర్వేరు రెండింటినీ పోల్చలేం. ఎవరితో పొత్తు పెట్టుకున్నా జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వదిలేసినట్టుగా వదలం. ఆంధ్రాలో కులాల గీతల మధ్యలో రాజకీయం చేయాలి. అది నాకు చాలా కష్టం. ఏపీలో ఉన్నవారు మామూలు వాళ్లు కాదు. సొంత బాబాయ్‌ను చంపించుకునే వాళ్లు. న్యాయ వ్యవస్థను ఇష్టానుసారంగా తిట్టేవాళ్లున్నారు. పోలీసు వ్యవస్థను ఇష్టారాజ్యంగా వాడేవాళ్లు. ప్రజాస్వామ్యం అనే పదానికి ఏపీలో విలువలేదు. అలాంటి నాయకత్వం ఇక్కడ లేదు. నేను ఇక్కడ తిరిగాను కాబట్టే .. అక్కడ చెప్పుతో కొడతాను అన్నాను. ఏపీలో నేను ఏ సాధించినా అక్కడి స్ఫూర్తితోనే. తెలంగాణ అసెంబ్లీలో 10మంది జనసేన ఎమ్మెల్యేలు ఉండాలని కోరుకుంటున్నా" అని పవన్ కల్యాణ్ అన్నారు.



## కడప నుంచి హైదరాబాద్‌కు చేరిన వివేకా హత్యకేసు దస్త్రాలు

హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు విచారణను తెలంగాణకు బదిలీ చేసిన నేపథ్యంలో ఈకేసుకు సంబంధించిన దస్త్రాలను హైదరాబాద్ ప్రిన్సిపల్ సీబీఐ కోర్టుకు తరలించారు.ఛార్జిషీట్లు, సాక్షుల వాంగ్మూలాలు, ఆధారాలు, ఇతర దస్త్రాలను 3 ట్రంకు పెట్టెల్లో కడప జిల్లా సెషన్స్‌కోర్టు నుంచి హైదరాబాద్ సీబీఐ కోర్టుకు తరలించారు. వివేకాహత్య కేసును దిల్లీ సీబీఐ విభాగం దర్యాప్తు చేస్తోంది. ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్, దస్తగిరిపై ప్రధాన ఛార్జిషీట్, దేవిరెడ్డి శంకర్‌రెడ్డిపై అనుబంధ ఛార్జిషీట్‌ను కడప జిల్లా సెషన్స్ కోర్టులో గతంలో సీబీఐ దాఖలు చేసింది. అయితే కేసు విచారణ ఏపీ నుంచి బదిలీ చేయాలన్న వైఎస్ వివేకా కుమార్తె సునీత అభ్యర్థన మేరకు..తెలంగాణకు బదిలీ చేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఫైళ్లన్నీ హైదరాబాద్ సీబీఐ కోర్టుకు దర్యాప్తు సంస్థ చేర్చింది. ఛార్జిషీట్లు పరిశీలించాలని కోర్టు కార్యాలయాన్ని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు పరిశీలించి ఛార్జిషీట్‌కు నంబరు కేటాయించిన తర్వాత హైదరాబాద్‌లో విచారణ ప్రక్రియ ప్రారంభం కానుంది.

# సంపాదకీయం

బుధవారం 25-01-2023

## రెజ్లింగ్ వివాదం సద్దుమణిగినట్టేనా

దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన రెజ్లింగ్ సమాఖ్య వివాదంపై విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. భారత బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ నేతృత్వంలో విచారణ కమిటీని ప్రభుత్వం నియమించింది. మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేశాడని రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో రెజ్లింగ్ సమాఖ్య కార్యవర్గాన్ని వెంటనే రద్దు చేయాలని, అధ్యక్షుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, భజరంగ్ పునియా, సాక్షి మలిక్ తదితరులు మూడు రోజుల పాటు ధర్నా చేయడం దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. కేంద్ర క్రీడల మంత్రి జోక్యం చేసుకుని ఈ ఆందోళనను విరమింప చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ చేపడుతామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే మేరీకోమ్ నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. మేరీకోమ్‌తో పాటు యోగేశ్వర్ దత్, సహదేవ్ యాదవ్, అలక్‌నంద అశోక్, డోలా బెనర్జీ తదితరులు సభ్యులుగా ఉన్నారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా రెజ్లర్ల బృందం తిరుగుబాటు చేసింది. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌పై ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత, ఒలింపియన్ వినేశ్ ఫోగట్ లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. లక్నోలోని నేషనల్ క్యాంప్ లో పలువురు కోచ్ లు మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారని వినేశ్ ఫొగాట్ ఆరోపించారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్నారు. వినేశ్ ఫొగాట్‌తో పాటు బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్ సహా 30 మంది రెజ్లర్లు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. వీరంతా ప్రధాని నరేంద్ర మోడీని కలవాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ఆరోపణలను డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ ఖండించారు. రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వినేశ్ ఫొగాట్ సహా రెజ్లర్లు ఆరోపించారు. ఈ ఆరోపణలపై చర్యలు తీసుకునే వరకు జంతర్ మంతర్ వద్ద ధర్నా కొనసాగించాలని రెజ్లర్లు నిర్ణయించారు. బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్ వంటి ప్రముఖులతో కూడిన 30 మంది రెజ్లర్లు ఈ ఆందోళనలో పాల్గొంటున్నారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఇస్తే కలిసి ఆధారాలు సమర్పిస్తామని విజ్ఞప్తి చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఖండించారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని, ఏ అథ్లెట్‌ను తను వేధించలేదన్నారు. ఆరోపణలు రుజువైతే తాను ఉరి వేసుకుంటానని చెప్పారు. తనపై కుట్ర జరుగుతోందని, అయితే తాను విచారణకు సిద్ధమన్నారు. తాము పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఒలింపిక్ విజేత రెజ్లర్లు ట్రయల్స్ ను కోరుకోవడం లేదన్నారు. 97 శాతం మంది క్రీడాకారులు ఫెడరేషన్ వద్దే ఉన్నారన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులతో కమిటీ వేస్తామని అన్నారు. ప్రభుత్వం అనుకుంటే ఎలాంటి విచారణకు అయినా సిద్ధమని ప్రకటించారు. బ్రిజ్ భూషణ్ రెజ్లర్లను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని ఒలింపియన్ వినేశ్ ఫోగట్ ఆరోపించారు. లక్నోలో జరిగిన జాతీయ శిబిరంలో బ్రిజ్ భూషణ్ శరణ్ మహిళా రెజ్లర్లను లైంగికంగా వాడుకున్నారని ఆరోపించారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడి ఆదేశాల మేరకు మహిళలా రెజ్లర్లను కొందరు ఆశ్రయిస్తున్నారు. బ్రిజ్ భూషణ్ కు లక్నోలో ఇల్లు ఉందని, అందుకే ఆయన అక్కడ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. తద్వారా అమ్మాయిలను సులభంగా లోబరుచుకోవచ్చని వారి ప్లాన్ అని ఆరోపించారు. మహిళా రెజ్లర్ల వ్యక్తిగత జీవితంలో డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు జోక్యం చేసుకుంటున్నారని వినేశ్ ఆరోపించారు. యూపీలోని కైజర్ గంజ్ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా ఉన్నారు. బ్రిజ్ భూషణ్ 6 సార్లు లోక్ సభకు ఎన్నికయ్యారు. బ్రిజ్ భూషణ్ శరణ్ 2011 నుంచి రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. దీనికి నిరసనగా జంతర్ మంతర్ వద్ద ధర్నా కొనసాగుతోంది. ప్రధాని మోదీని కలిసి ఆరోపణలకు సంబంధించిన అన్ని ఆధారాలను అందజేస్తామని క్రీడాకారులు చెబుతున్నారు. ఈ ఆరోపణలు వెలుగులోకి రావడంతో క్రీడా మంత్రిత్వ శాఖ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుపై 72 గంటల్లోగా సమాధానం ఇవ్వాలని క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశించింది. అంతే కాదు సమాధానం రాకపోతే కఠిన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించింది. ఈ వివాదం కారణంగా యూపీలో మహిళల రెజ్లింగ్ శిబిరం రద్దైంది.

# పాలక మండలికి పదవీ గండం

తిరుమల, జనవరి 24, టీటీడీ పాలకమండలి సభ్యులకు పదవీ గండం ఏర్పడింది. చైర్మన్ భాధ్యతల నుంచి తప్పుకుని, యాక్టీవ్ పాలిటిక్స్ పై వెళ్లాలన్న వైవి సుబ్బారెడ్డి నిర్ణయం, సభ్యుల పాలిట శాపంలా మారుతోంది. చైర్మన్ పదవికి వైవీ రాజీనామా చేస్తే..పాలకమండలి పూర్తిగా రద్దవనుంది. అయితే తిరిగి పాలకమండలిలో తమకు చోటు దక్కుతుందా అని.. ఆశగా ఎదురు చూస్తున్నారు కొందరు సభ్యులు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో సభ్యత్వం అంటేనే ఎంతో ప్రతిష్టాత్మకం. పాలకమండలిలో సభ్యత్వం కోసం పైరవీలు మాములుగా వుండవు. రాష్ట్ర పరిధులు దాటి, కేంద్ర నాయకత్వం నుంచి కూడా సిఫార్సులు రావడంతో ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతుంటోంది వ్యవహారం. ఎన్నడూ లేని విధంగా గత పాలకమండలి ఏర్పాటు సమయంలో 25 మంది సభ్యులతో పాటు మరో 50 మందిని ఆహ్వానితులుగా నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. కానీ, దేవాదాయశాఖ చట్టం మేరకు ఆహ్వానితులకు పాలకమండలిలో చోటు లేకపోవడం, ఈ అంశంపై కోర్టుకెక్కడంతో 50 మంది ఆహ్వానితుల నియామకం అటకెక్కింది. 2021 ఆగస్టులో టీటీడీ పాలకమండలి చైర్మన్ గా వైవి సుబ్బారెడ్డి నియమితులైతే, సభ్యులను సెప్టెంబర్ చివర్లో నియమించింది. అయినా వారి పదవీ కాలం ఆగస్టు నుంచే లెక్కింపు మొదలైంది. పాలక మండలిలో ఏపి నుంచి ఏడుగురు అవకాశం లభిస్తే? మిగిలిన సభ్యులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. ఒక దశలో పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేత రాజీనామ చెయ్యించి మరీ, తమిళనాడుకు చెందిన కృష్ణమూర్తిని సభ్యుడిగా నియమించింది ప్రభుత్వం. తరువాత నేర చరిత్ర కలిగిన వారికి పాలకమండలిలో సభ్యత్వం ఇచ్చారంటూ కోర్టుని ఆశ్రయించారు బిజేపి నేత భానుప్రకాష్ రెడ్డి. ఇక రెండు నెలలు క్రితం చీటింగ్ కేసులో పాలకమండలి సభ్యుడు లక్ష్మీనారాయణ అరెస్ట్ కావడంతో పదవికి రాజీనామా చేసారు. అతని స్థానంలో కొత్తగా దాసరి కిరణ్ కుమార్ ని సభ్యుడిగా నియమించింది ప్రభుత్వం. పదవీ కాలం 8 నెలలే వున్నప్పటికి, సభ్యత్వం లభించడమే పదివేలు అన్నట్లుగా భావిస్తున్న సమయంలో వారికి షాక్ తగిలింది. మరో ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర ఎన్నికలు వుండటం. విశాఖ జిల్లాకు ఇంఛార్జిగా టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి బాధ్యతలు అప్పగించింది వైసీపీ అధిష్టానం. రాజకీయంగా బీజీ కావడంతో టీటీడీ చైర్మన్ పదవి నుంచి తప్పుకునేందుకు సుబ్బారెడ్డి సిద్దమైనట్లు సమాచారం. ఇదే విషయాన్ని సీఎం జగన్ దృష్టికి కూడా తీసుకువెళ్ళినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే.. పదవి నుంచి సుబ్బారెడ్డి తప్పుకోవడమే తరువాయి అన్నట్లుగా ప్రచారం కూడా మొదలయ్యింది. తదుపరి టీటీడీ చైర్మన్ ఎవ్వరంటూ చర్చలు కూడా జోరుగా సాగుతున్నాయి. అయితే ఇప్పుడు అటు ఇటు కాకూండా పోతుంది మాత్రం పాలకమండలి సభ్యులే. దేవాదాయశాఖ చట్టం మేరకు ఛైర్మన్ తన పదవికి రాజీనామ చేస్తే? పాలకమండలి పూర్తిగా రద్దవుతుంది. దీంతో మరో 7 నెలల పదవీ కాలం వుండగానే, ప్రస్తుత సభ్యులు మాజీలుగా మారిపోతారు. కొత్త ఛైర్మన్ తో పాటు ప్రస్తుతం వున్న సభ్యులు తిరిగి నియమితులవడం దాదాపుగా అసాధ్యమే. ఇద్దరు, ముగ్గురు మినహాయిస్తే.. మిగిలిన వారికి మరోసారి చోటు దక్కే అవకాశమే లేదని తెలుస్తోంది. ఎన్నికల సంవత్సరం కావడంతో, ఈసారి పాలకమండలిలో రాష్ట్రవాసులకే ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలన్న భావనలో ప్రభుత్వ పెద్దలు వున్నారని సమాచారం.

# బాలినేని పొలిటికల్ రిటైర్మెంట్..?



ఒంగోలు, జనవరి 23, ఆమధ్య మంత్రి పదవి తీసేసిన తర్వాత కూడా బాలినేని శ్రీనివాసులరెడ్డి కొంతకాలం అసంతృప్తితో ఉన్నారు. ఆ తర్వాత సర్దుకుపోయారు. తీరా ఇప్పుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు వైసీపీ టికెట్ ఇవ్వకపోవచ్చునని అన్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, 2024 ఎన్నికలు – సీట్లపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం జిల్లానుంచి బాలినేని శ్రీనివాసులరెడ్డి, ఆదిమూలపు సురేష్ జగన్ టీమ్–ఎ లో ఉన్నారు. టీమ్–బి సమయానికి మంత్రి పదవులు తిరిగి సంపాదించిన లిస్ట్ లో ఆదిమూలపు సురేష్ ఉన్నారు కానీ బాలినేనిని తప్పించారు సీఎం జగన్. వాస్తవానికి జగన్ కి బంధువు అయిన తనను పక్కనపెడతారని బాలినేని ఊహించలేదు. అదే సమయంలో తన జిల్లానుంచి ఆదిమూలపు సురేష్ ని కొనసాగిస్తారని కూడా ఆయన అనుమానించలేదు. అందుకే అప్పట్లో అసంతృప్తితో కొన్ని వ్యాఖ్యలు చేశారు, కొంతకాలం దూరంగా ఉన్నారు. మరిప్పుడు ఆయన ఎందుకీ వ్యాఖ్యలు చేశారో తేలాల్సి ఉంది. "సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పించే అవకాశాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో నాకు టికెట్ రాకపోవచ్చు. నా భార్య సచీదేవికి జగన్ టికెట్ ఇస్తారేమో? నీకు సీటు లేదు. నీ భార్యకు ఇస్తామని సీఎం జగన్ అంటే నేనైనా చేసేదేం లేదు. ఈసారి మహిళలకే అవకాశాలు అని జగన్ తేల్చి చెబితే నేనైనా పోటీ నుంచి పక్కకు తప్పుకోవాల్సిందే. అందుకే నియోజకవర్గ స్థాయి నేతలు విభేదాలు పక్కనపెట్టి పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా పని చేయండి." అని అన్నారు బాలినేని. ప్రకాశం జిల్లాలోని కొండేపి నియోజకవర్గంలో 2019లో టీడీపీ గెలిచింది. ఈసారి అక్కడ కూడా వైసీపీ గెలుపుకి ప్రణాళికలు రచిస్తున్నారు. అయితే వైసీపీ కోఆర్డినేటర్ వరికూటి అశోక్ బాబు.. పార్టీ కార్యకర్తలు, నాయకులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై బాలినేని స్పందించారు. పార్టీ గెలుపు కోసం అందరితో కలసి నడవాలని సూచించారు బాలినేని. 2019లో ఓడిపోయాం. ఈసారి కచ్చితంగా గెలిచి తీరాలి, వైసీపీ జెండా కొండెపిపై ఎగరేయాలని అని చెప్పారు బాలినేని. కేవలం పార్టీ నాయకులు, కార్యకర్తలకు చురుకు పుట్టించడానికే బాలినేని ఆ వ్యాఖ్యలు చేశారా, లేక ఆయనకు పార్టీ టికెట్ పై ఇప్పటికే హింట్ ఇచ్చేశారా అనేది తేలాల్సి ఉంది. ఒంగోలులో బాలినేని తన వారసుడిగా కొడుకు ప్రణీత్ రెడ్డిని ప్రమోట్ చేస్తున్నారు. ఇప్పటికే బాలినేని వ్యవహారాలన్నీ ఆయన కొడుకు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన కొత్తగా తన భార్య సచీదేవి పేరు తెరపైకి తేవడం విశేషం. అంటే బాలినేని కుటుంబంలో మొత్తం ముగ్గురు పోటీకి రెడీగా ఉన్నారని ఆయన హింటిచ్చినట్టయింది. అంటే ఈ ముగ్గురిలో ఎవరో ఒకరికి, లేదా అంతకు మించి టికెట్లు ఇవ్వాల్సి ఉంటుందని ఆయన ఇన్ డైరెక్ట్ గా చెప్పేశారా అనేది తేలాల్సి ఉంది. మొత్తమ్మీద బాలినేని వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లోనే కాదు, ఏపీ మొత్తం సంచలనంగా మారాయి.

# ఆనంకు పొగ పెట్టేశారా...

నెల్లూరు, జనవరి 24, అధికారపార్టీలో జరుగుతున్న పరిణామాలపై మాజీ మంత్రి.. ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి గరంగరంగా ఉన్నారు. తనను పక్కన పెట్టడంపై ఆయన రగిలిపోతున్నారు. చెప్పాల్సింది చాలా ఉందంటున్న ఆనం.. తన ఆక్రోశాన్ని త్వరలో బయట పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. సన్నిహితులతో ఆయన సమాలోచనలు చేస్తున్నారు. అవమానాలు భరిస్తూ వైసీపీలో ఉండలేమన్నది ఆనం వాదన. తన రాజకీయ భవిష్యత్‌పై మార్చిలో నిర్ణయం తీసుకుంటానని అనుచరులకు ఆనం చెబుతున్నారట. అయితే తానే పోటీలో ఉండాలా? లేక వారసులను బరిలో దింపాలా అనేది క్లారిటీ రావాల్సి ఉంది. అలాగే ఆత్మకూరులో పోటీ చేస్తారా లేక నెల్లూరు సిటీ నుంచి బరిలో ఉండాలో మాజీ మంత్రి తర్జన భర్జన పడుతున్నట్టు సమాచారం. 2019లో వైసీపీ నుంచి వెంకటగిరిలో పోటీ చేసి గెలిచారు ఆనం. సీనియర్‌గా తనకు అధికార పార్టీలో ప్రాధాన్యం దక్కుతుందని ఆయన ఆశించినా అలా జరగలేదు. అప్పటి నుంచి అడపాదడపా తన అసంతృప్తిని బయట పెడుతూనే ఉన్నారు. అదీ సొంత పార్టీ వైసీపీపైనా.. వైసీపీ ప్రభుత్వంపైనా బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు ఈ మాజీ మంత్రి. మొదట్లో పార్టీ పెద్దలు పిలిచి మాట్లాడటంతో కొంతకాలం సైలెంటైనా.. తర్వాత మళ్లీ పాత పద్ధతిలోకి వచ్చేశారు రామనారాయణరెడ్డి. ఈసారి సొంత పార్టీపైనా.. రాష్ట్ర ప్రభుత్వంపైనా ఆయన విమర్శలు మరింత పదునెక్కాయి. ఇన్నాళ్లూ ఓపికగా వేచి చూసిన వైసీపీ అధిష్ఠానం లాభం లేదనుకుని యాక్షన్‌లోకి దిగింది. రామనారాయణరెడ్డి అధికారాలకు కత్తెర వేస్తోంది. ఇటీవలే వెంకటగిరి వైసీపీ సమన్వయకర్తగా నేదురమల్లి రాంకుమార్‌రెడ్డికి పగ్గాలు అప్పగించింది పార్టీ అధిష్ఠానం. ఆ వెనువెంటనే ఆనం రామనారాయణరెడ్డి భద్రతను టు ప్లస్ టు నుంచి వన్ ప్లస్ వన్‌కు కుదించింది. తాజాగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లొద్దని పరోక్షంగా మాజీ మంత్రికి సంకేతాలు పంపించింది అధికారపార్టీ. ఒకవేళ ఆనం ఆ కార్యక్రమాన్ని నిర్వహించినా వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది ఎవరూ వెళ్లొద్దని మౌఖికంగా ఆదేశాలు వెళ్లాయి. ఇదేకాదు.. వెంకటగిరిలో ఆనం బలాన్ని తగ్గించే దిశగా మరిన్ని చర్యలకు అధికారపార్టీ దిగుతోంది. వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, రాపూరు అఎ నాగమల్లేశ్వరరావును బదిలీ చేశారు. వీరిద్దరూ మాజీ మంత్రి ఆనం సిఫారసుపై వచ్చిన ఆఫీసర్లు కావడంతో వారిని ఇక్కడి నుంచి పంపేశారట. ఇలాంటి అధికారుల జాబితాను సిద్ధంగా చేసి.. వారిని కూడా వెంకటగిరి నుంచి బదిలీ చేస్తారని అనుకుంటున్నారు. ఈ వరుస పరిణామాలపై మాజీ మంత్రి ఆనం వర్గం రగిలిపోతున్నట్టు సమాచారం. గతంలో ఇదే విధంగా కామెంట్స్ చేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పార్టీ పెద్దలు పిలిచి మాట్లాడారని.. అదేవిధంగా పిలిచి మాట్లాడతారని ఆనం వర్గం భావించిందట. కానీ.. కోటంరెడ్డిని.. ఆనంను ఒకే గాటన చూడలేదు పార్టీ అధిష్ఠానం. దాంతో మాజీ మంత్రి సైతం తన రాజకీయ భవిష్యత్‌పై ఆలోచనలు చేస్తున్నారట. జరుగుతున్న పరిణామాలపై ఇప్పటికిప్పుడు స్పందించకుండా.. సమయం చూసుకుని ఆనం బరస్ట్ అవుతారని తెలుస్తోంది. టీడీపీకి మాజీ మంత్రి మళ్లీ దగ్గరవుతున్నారట. ఆత్మకూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్‌లో టీడీపీకి బలమైన నేతలు లేరని.. ఆ మూడింటిలో ఏదో ఒకచోట రామనారాయణరెడ్డి పోటీ చేయొచ్చని చెవులు కొరుక్కుంటున్నారు. మార్చి నాటికి రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తారని తెలుస్తోంది. అలాగే వచ్చే ఎన్నికల్లో తానే పోటీ చేయాలా లేక వారసులను బరిలో దింపాలా అనే ఆలోచనలోనూ ఆనం ఉన్నారట. మరి.. మాజీ మంత్రి ఏం చేస్తారో చూడాలి

# ధర్మకర్తల మండలి... అధర్మాలు

శ్రీశైలం, జనవరి 24, శ్రీవారి ఆలయంపై డ్రోన్స్ తిరుగుతుంటే భద్రత సిబ్బంది ఏం చేస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. యాంటీ డ్రోన్ సిస్టంను టీటీడీ వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. డీఆర్డీవో అధికారులతో ఏడాది క్రితం యాంటీ డ్రోన్ సిస్టంపై చర్చలు జరిపినా, దాని అమలులో జాప్యం అయిందని అన్నారు. వెంటనే డీఆర్డీవో అధికారులతో చర్చ జరిపి టీటీడీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి యాంటీ డ్రోన్ సిస్టం అమలు చేయాలని కోరారు. ఐఐటి నిపుణులు తెలిపిన విధంగా తిరుమలలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ విషయంలో అజాగ్రత్త వహిస్తే జోషిమట్ పరిస్థితి పునరావృతం అవుతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీశైలంలో ధర్మకర్తల మండలి సభ్యులు అవినీతికి పాల్పడినట్లే తిరుమలలో కొందరు పాలకమండలి సభ్యులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పీఏల ద్వారా సేవ టిక్కెట్లు, గదులను అధిక ధరకు విక్రయిస్తున్నారని భక్తుల వద్ద నుంచి ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ ఏపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి కోరారు. తిరుమల శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఓ వీడియో నెట్టింట హల్ చల్ చేస్తుంది. ఈ వీడియో వైరల్ అవడంతో టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. తిరుమల శ్రీవారి ఆలయంపై, పరిసర ప్రాంతాల్లో విమానాలు, డ్రోన్ కెమెరాల నిషేధం ఉంది. అయితే, శ్రీవారి ఆలయానికి సంబంధించిన వీడియాను ఐకాన్ అనే ఓ యూట్యూబ్ ఛానల్ పోస్టు చేయడం కలకలంగా మారింది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారడంపై శ్రీవారి భక్తులు, ఆగమ సలహాదారులు మండిపడుతున్నారు. కోట్లాది మంది ఆరాధ్య దైవం అయిన శ్రీనివాసుడి దర్శనార్థం ప్రతినిత్యం లక్షలాది మంది భక్తులు దేశ విదేశాల నుండి తిరుమల పుణ్య క్షేత్రానికి వస్తుంటారు. అయితే, తిరుమల కట్టుదిట్టమైన భద్రత వలయాలతో పటిష్ఠమైన సెక్యూరిటీ కలిగిన దేవస్థానం. నిత్యం మాన్యువల్ సెక్యూరిటీ నుంచి మూడో కన్ను వరకు అన్ని కాపు కాస్తూనే ఉంటాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా హైసెక్యూరిటీ నడుమ టీటీడీ విజిలెన్స్, పోలీసు, ఆక్టోపస్ అంటూ వివిధ సెక్యూరిటీ ఫోర్స్ లతో పాటు సీసీ కెమెరాలు నిత్య పర్యవేక్షణలో తిరుమల సురక్షితంగా ఉంటుంది. ఇలాంటి హైసెక్యూరిటీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలు ఎగరవేయరాదనే నిబంధనలు ఉన్నాయి. ఒకవేళ అనుమతి లేకుండా డ్రోన్స్ ఎగురవేస్తే కటకటాల పాలుకావాల్సిందే. ఇక ఇప్పటికే నో ఫ్లై జోన్ గా ప్రకటించాలని టీటీడీ కేంద్ర పౌర విమానయాన శాఖను పలుమార్లు కోరింది. అయితే సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసిన పౌర విమానయాన శాఖ అధికారులు అది సాధ్యం కాదని తేల్చారు. విమానం సంగతి పక్కన బెట్టిన డ్రోన్స్ ఎగరేయరాదనే నిబంధనలు మాత్రం పటిష్టంగా అమలు చేస్తుంది టీటీడీ. ఆగమశాస్త్ర నిబంధనల మేరకు ఆనంద నిలయ గోపురం చిత్రీకరణకు అనుమతులు లేవని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. శ్రీవారి ఆలయాన్ని చిత్రీకరించి, సోషల్ మీడియాలో వైరల్ చేసిన విజువల్స్ పై విచారణ జరుపుతున్నామన్నారు. హైదరాబాద్ కు చెందిన వారు విజువల్స్ ని అప్లోడ్ చేసినట్లు గుర్తించామన్నారు. వీళ్లపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. స్టిల్ ఫొటోగ్రాఫర్ తీసిన వీడియోలుగా విజిలెన్స్ అధికారులు గుర్తించారని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. కుట్ర కోణంలో టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నారా అనే దిశగా కూడా విచారణ జరుపుతున్నామన్నారు. రెండు, మూడు రోజులలో వాస్తవాలను భక్తులు ముందు ఉంచుతామని సుబ్బారెడ్డి చెప్పారు.

## నేడు 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం

1950 జనవరి 25వ తేదీన భారత ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీన్ని స్ఫురణకు తెచ్చేలా.. ఓటు హక్కు విలువను చాటి చెప్పేలా ఈ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని 2011 జనవరి 25 నుండి నిర్వహిస్తున్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదిన జాతీయ ఓటర్ల దినోత్సవమును జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం ఈ రోజున ఓటు హక్కుపైనా, ప్రజా స్వామ్య వ్యవస్థపైనా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా జాతీయ ఎన్నికల కమిషన్ కొన్ని ప్రత్యేక




కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఇది 2011 జనవరి 25 నుండి కమిషన్ ఫౌండేషన్ రోజును గుర్తించడానికి ప్రారంభమైంది. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అధ్యక్షతన జరిగిన భారత కేంద్ర మంత్రివుండలి సమావేశంలో ఈ చట్టం అమలుకు ఆమోదం లభించింది. 18 సంవత్సరాల వయసున్న కొత్త ఓటర్లు, ఎన్నికల రికార్డుల్లో పాల్గొనడానికి తక్కువ ఆసక్తిని చూపిస్తున్నారని, వారి నమోదు స్థాయి కొన్ని సందర్భాల్లో 20 నుంచి 25 శాతానికి తగ్గిపోవడంతో సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు, దేశవ్యాప్తంగా 8.5 లక్షల పోలింగ్ కేంద్రంలలో ప్రతి సంవత్సరం జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయస్సు వచ్చే అర్హతగల అన్ని ఓటర్లు గుర్తించడానికి తీవ్ర ప్రయత్నాలు చేపట్టాలని భారత ఎన్నికల కమిషను నిర్ణయించింది. ఇటువంటి అర్హత కలిగిన ఓటర్లు సమయానికి నమోదు చేసి ప్రతి సంవత్సరం జనవరి 25న వారి ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డు అందచెయ్యాలని, ఈ చొరవ యువతకి సాధికారత, వారి బాధ్యతలను నిర్వర్తించటానికి స్ఫూర్తి ఇవ్వనుంది.

# ఒక్కటవుతున్న ప్రతిపక్షాలు

విజయవాడ, జనవరి 24, సర్పంచ్‌లపై సమస్యలపై విపక్షాలు పోరుబాట పట్టాయి. పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయి. ముఖ్యంగా బీజేపీ, వామపక్షాలు ఒకే వేదికపై కనిపించాయి. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేసేందుకు సిద్ధమని నేతలు ప్రకటించారు. పంచాయతీ సర్పంచులు బాధ పెట్టడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయటమే అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్రస్థాయిలో ఆరోపించారు. సర్పంచులు సమస్య మీద కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సర్పంచులు చేసే పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని సోము వీర్రాజు హామీ ఇచ్చారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ఈ ఇద్దరి నేతలు పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వం పంచాయతీ నిధులను దారి మళ్ళిస్తుందనీ ఆరోపించారు ఈ సమావేశానికి హాజరైన నాయకులు. కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం ద్వారా పంపిన రూ.8,660 కోట్ల నిధులు తిరిగి సర్పంచుల ఎఫ్‌పిఎంఎస్ ఖాతాలో జమ చెయ్యాలనీ డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలను సర్పంచ్ పరిధిలోకి తీసుకువచ్చి సర్పంచులకు, ఎంపిటిసిలకు 15వేలు, ఎంపిపి, జెడ్‌పిటిసిలకు 30వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. వాలంటీర్ల కంటే సర్పంచులకు తక్కువ గౌరవ వేతనం ఇస్తున్నారనీ ఆరోపించారు. పంచాయతీ సర్పంచులను బాధ పెట్టడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయటమే అని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన క్యాబినెట్ మంత్రుల తరహాలనే, సర్పంచులను దిష్టిబొమ్మలుగా చేశారనీ ఆరోపించారు సీపీఐ, టీడీపీ లీడర్లు. రాష్ట్రంలో మంత్రులను గుర్తించే పరిస్థితి లేదనీ, మంత్రులను దద్దమ్మలు చేశారనీ ఎద్దేవా చేశారు. సర్పంచుల సమస్యల పట్ల సీఎం ఇంటిని ముట్టడించటానికైనా వెనుకాడమని హెచ్చరించారు. సర్పంచులు చేసే ఆందోళనలో తమ పార్టీల నేతలు ముందుంటుందనీ వెల్లడించారు. బిజెపికి భీమవరానికి వీడదీయలేని అనుబంధం ఉందని భవిష్యత్‌లో నర్సాపురం పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ శాశ్వత నియోజకవర్గంగా మారుస్తామంటున్నారు నేతలు. భీమవరం కేంద్రగా జరిగే పార్టీ సమావేశాలకు సంబంధించిన వివరాలను నేతలు వెల్లడించారు. ఈ సమావేశాలకు ఐదుగురు కేంద్రమంత్రులు రానున్నారని తెలిపారు. భీమవరంలో మూడు పర్యాయాలు జరిగాయని, నాల్గోసారి కూడా ఇక్కడే జరుగుతున్నాయని అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాతో బిజెపికి ఎంతో అనుబంధం ఉందని, ప్రాంతీయ పార్టీలు బిజెపిపై విషప్రచారం చేస్తున్నాయని చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కారు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ప్రత్యేక పెట్టిందని, కీలక పాత్ర పోషించనున్నామని వివరించారు. కుటుంబ పార్టీలతో పొత్తులు లేవని, 2024లో అధికారాన్ని చేపట్టే దిశగా బిజెపి ముందుకు వెళుతుందని అన్నారు బీజేపీ నేతలు. భీమవరంలో జరిగే రాష్ట్రకార్యవర్గ సమావేశాల్లో బిజెపి కీలక పాత్ర పోషిస్తోందని, ఈ రాష్ట్రంలో 18 శాతం ఓటింగ్ సాధించిన పార్టీ బిజెపి రాష్ట్ర రాజకీయాల్లో ఎదిగేందుకు కీలక సమయం ఇదేనని అభిప్రాయపడ్డారు.

# వెస్ట్ పాలిటిక్స్ లో జనసేన కీలకం



విజయవాడ, జనవరి 24, బెజవాడ పశ్చిమ పాలిటిక్స్ ఇంట్రస్టింగ్‌గా మారాయి. ఇక్కడ అధికార పక్షం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి నిత్యం హాట్ కామెంట్స్ రాజకీయ వర్గాల్లోకి ట్రోల్ అవుతూనే ఉంటాయి. అధికార పక్షం నుంచి గట్టిగా వాయిస్ వినిపించే వ్యక్తుల్లో వెలంపల్లి శ్రీనవాసరావు ఒకరు. మాజీ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ రాజకీయం చేస్తున్నారు వెలంపల్లి. గడప గడపకు కార్యక్రమం ద్వార వెలంపల్లి ప్రజల ముందుకు వెళ్ళిన సమయంలో సమస్యలపై కొందరు నిలదీయడం హాట్ టాపిక్ అయింది. అదే టైంలో ఆయన రియాక్షన్ కూడా సంచలనంగా మారింది. పోలీసులను వినియోగించి ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టండని ఆదేశించటం కలకలం రేపింది. ఇలాంటి ఘటనలు చాలా ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చాయి. వీటితోపాటు వెల్లంపల్లి శ్రీనివాసరావు ఎన్నికల టైంలో ఇచ్చిన హామీలపై కూడా చర్చ నడుస్తోంది. ప్రధానంగా కొండ ప్రాంత వాసులకు తాగునీటి సరఫరా ఇంత వరకు కొలిక్కి రాలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ కావటంతో అధికార పక్షాన్ని కాస్త ఇబ్బంది పెట్టనుంది. దీన్ని వాళ్లు కూడా చాలా ప్రాధాన్యత అంశంగా తీసుకుంటున్నారు. కులాల వారీగా లెక్కలు పరిశీలిస్తే ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనిసవారావు వైశ్య సామాజక వర్గానికి చెందిన నేత. నియోజకవవర్గంలో మరో కీలకమైన సామాజిక వర్గం నగరాల సామాజిక వర్గం. దీంతో అదే సామాజిక వర్గానికి చెందిన మహిళకు మేయర్ సీట్ కేటాయించారు. ఇందులో వెలంపల్లిదే ప్రధాన పాత్ర. ఈ నియోజకవర్గంలో జనసేన అత్యంత కీలకంగా వ్యవహరిస్తోంది. గత ఎన్నికల్లో కూడా వెలంపల్లికి జనసేన పార్టీ గట్టి పోటీనే ఇచ్చింది. వాస్తవానికి ఈ నియోజకవర్గంలో గతంలో ప్రజారాజ్యం పార్టీ గెలిచింది. అదే ఊపు మరలా వస్తుందని, 2019లో కూడా జనసేన గెలుస్తుందని భావించారు. అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హవా వీయటంతో సీటును వెలంపల్లి గెల్చుకున్నారు. వైసీపీకి ఇక్కడ గట్టి పోటీ ఇస్తుంది కూడా జనసేన పార్టికి చెందిన నియోజకవర్గ ఇంచార్జ్ పోతిన మహేష్. మంత్రిగా పని చేస్తున్న సమయంలోనూ వెలంపల్లికి పోతిన మహేష్ కౌంటర్ లు ఇచ్చారు. దుర్గగుడి విషయంలో వెలంపల్లి అక్రమాలకు పాల్పడటం, కాంట్రక్టర్లకు అనుకూలంగా వ్యవహరించటం, దసరా, భవానీ దీక్షల హయాంలో జరిగిన అక్రమాలపై హాట్ కామెంట్స్ చేయటం, అవి మంత్రిగా పని చేసిన వెలంపల్లిని ఇరకాటంలోకి నెట్టాయి. దీంతో ఇక్కడ పోటీ జనసేన,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీదే అన్నట్లుగా సీన్ మారింది. ఈ నియోజకవర్గంలో టీడీపీ నుంచి కీలక నేతలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న,మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ ఈ నియోజకవర్గానికి చెందిన నేతలే. అయితే ఇక్కడ గ్రూపు రాజకీయాలతో టీడీపీ పూర్తిగా వెనుకబడింది. జలీల్ ఖాన్ కుమార్తెకు గత ఎన్నికల్లో సీటు కేటాయిచటంపై బుద్దా వెంకన్న తీవ్రంగా వ్యతిరేకించారు. అంతే కాదు జలీల్ ఖాన్ కుమార్తెకు టీడీపీ ఎంపీ కేశినేని నాని మద్దతు ఇవ్వటంపై బుద్దా వెంకన్న, మరో నేత నాగుల్ మీరా వ్యతిరేకించి పార్టీకి వ్యతిరేకంగా పని చేశారని టాక్. అందుకే జలీల్ ఖాన్ కుమార్తె ఓడిపోయారని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. ప్రస్తుతం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలను ఎంపీ కేశినేని నాని పర్యవేక్షిస్తున్నారు. ఇప్పుడు పొత్తుల వ్యవహరం తెర మీదకు రావటంతో, పశ్చిమ సీటు జనసేనకు వెళుతుందని భావించిన నేతలు, నియోజకవర్గంలో పార్టీని పూర్తిగా పట్టించుకోవటం లేదని అంటున్నారు. ఒక వేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే మాత్రం జనసేన, వైఎస్ఆర్‌సీపీ మధ్యే పోటీ ఉంటుందని టీడీపీ నేతలు కూడా లోలోపల చర్చించుకుంటున్నారట.

## లోకేష్ పాదయాత్రకు కుప్పంలో భారీ ఏర్పాట్లు

కుప్పం లోకేష్ పాదయాత్రకు కుప్పంలో భారీ ఏర్పాట్లు చేసారు. ఈ నెల 27 న కమతమూరు వద్ద బహిరంగ సభ జరగనుంది. సుమారు 25 ఎకరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్న టిడిపి శ్రేణులు, బహిరంగ సభకు సుమారు లక్ష మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. యువగళం పాదయాత్రకు అనుమతి లభించడంతో తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం పెరిగింది. లోకేష్ పాదయాత్రకు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

## మాజీ మంత్రి సుచరిత డ్రైవర్ ఆత్మహత్య

గుంటూరు ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి సుచ రిత డ్రైవర్ చెన్న కేశవులు బలవన్మర ణానికి పాల్పడ్డాడు.తన గదిలో సర్వీస్ రివాల్వర్తో కాల్చుకుని చనిపోయాడు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఏపీ మాజీ హోంమంత్రి సుచరిత డ్రైవర్గా పనిచేసే చెన్నకేశవులు ఆత్మహత్య చేసుకున్నాడు.గుంటూరు లోని బ్రాడీ పేట 4వ లైనులో ఉన్న తన గదిలో సర్వీస్ రివాల్వర్తో కాల్చుకుని చనిపో యాడు.దీంతో ఘటనా స్థలికి చేరుకున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ చెన్నకేశవులు ఆత్మహత్యపై వివరాలను సేకరించారు.

## గూడూరులో ఘనంగా 34 వ రోడ్డు భద్రత వారోత్సవాలు

గూడూరు ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలో రవాణా శాఖ, పోలీస్ శాఖ ల ఆధ్వర్యంలో 34 వ రోడ్డు భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా చేపట్టిన హెల్మెట్ బైక్ ర్యాలీని డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి రవీంద్రనాథ్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు.. వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే ఈ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగిందని చెప్పారు.. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని వారు వివరించారు.. పోలీసు, రవాణా శాఖ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన ఈ అవగాహన ర్యాలీ గూడూరు కోర్టు సెంటర్ నుండి చిల్లకూరు వరకు కొనసాగింది...

## నడక లోకేష్ ఆరోగ్యానికి మంచింది

శ్రీకాకుళం నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని, నారా లోకేష్ లాంటి వ్యక్తులకు ఇంకా మంచిదని యువగళం పాదయాత్రను ఉద్దేశిస్తూ రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎద్దేవా చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస మున్సిపాలిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ప్రస్తుతం ఏమైనా సందర్భముందా అని ఆయన ప్రశ్నించారు. అధికార కాంక్ష తోనే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు.

మోసాలు, వెన్నుపోట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019 ఎన్నికలకు మూడు నెలల ముందు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి యువనేస్తంతో రాష్ట్రంలో యువకులకు ఎంత వరకు లబ్ధి చేకూర్చారో లోకేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలన ముందు ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నినా అధికారంలోకి రాలేరని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు వేస్తున్న పగటి వేషాలు నిత్యం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బాదుడే బాదుడే పేరుతో ప్రజల్లోకి వెళ్ళిన టిడిపి నేతలకు ప్రజలు తిరస్కరించారని అన్నారు.

# పొత్తుల పొడుపులు

విజయవాడ, జనవరి 24, ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉన్నా రాజకీయం మాత్రం ఎప్పుడో హీటెక్కింది. పాదయాత్రలు మొదలవుతున్నాయి. బస్సు యాత్రలు కూడా షురూ అవుతున్నాయి. ఇక టీడీపీ అధినేత చంద్రబాబు ఈసారి పొత్తులతోనే ఎన్నికల గోదాలోకి దిగుతారు. అందులో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే పొత్తులు కుదరకపోయినా క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు మానసికంగా ఒకటయిపోయారు. కలసి పోటీ చేద్దామన్న నిర్ణయానికి వచ్చారు. పార్టీ అధినేతలు కలవకపోయినా ఏదైనా ఆందోళన కార్యక్రమాల్లో రెండు పార్టీల కార్యకర్తలు కలసి పాల్గొంటున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒకరికి ఒకరు అండగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే జగన్ ను గద్దె దించడానికి ఈసారి చంద్రబాబు ఎలాంటి త్యాగాలకయినా సిద్ధపడతారన్న సంకేతాలు వెలువడుతున్నాయి. జగన్ ను అధికారంలో నుంచి దించడమే లక్ష్యంగానే చంద్రబాబు నిర్ణయాలు ఉంటాయన్నది కాదనలేని వాస్తవం. అది ఏ రూపంలో ఉంటాయన్నది చెప్పలేం. పార్టీ నేతలతో పాటు తన కుటుంబం నుంచి కూడా కొన్ని త్యాగాలు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పవన్ కల్యాణ్ గతంలో మాదిరి నేత కాదు. ఆయన ఈ పన్నెండేళ్ల కాలంలో రాజకీయంగా రాటుదేలారు. పవన్ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు వస్తాయన్నది ముందుగా ఊహించలేనంత అమాయకత్వంలో అయితే టీడీపీ అధినేత ఉండరనే అనుకోవాలి. నలభై ఏళ్లకు పైగానే రాజకీయ అనుభవం ఉన్న నేత కావడంతో ఏ ఏ ప్రతిపాదనలతో పవన్ కల్యాణ్ చర్చలకు వస్తారన్న అంచనా ఆయన వేయగలరు. ఇప్పటికే చంద్రబాబు దానిపైన కూడా ఒక క్లారిటీకి వచ్చారంటారు. గతంలో మాదిరి రాష్ట్ర పరిస్థితులు ఇప్పుడు లేవు. 2009లోనే చిరంజీవి ప్రజారాజ్యం దెబ్బకు తాను ఓటమి చెందానని చంద్రబాబుకు తెలియంది కాదు. అందుకోసం పవన్ ను దూరం చేసుకునేంత రాజకీయ అజ్ఞానంలో ఉండరు. ఆయనకు తొలి నుంచి రాజకీయంగా ఉన్నదే అది. నాయకత్వం, ముందుగా అంచనా వేయడంలో చంద్రబాబు దిట్ట. అందుకే పవన్ కల్యాణ్ నుంచి ఎటువంటి ప్రతిపాదన వచ్చినా అందులో కొన్ని మార్పులు చేసి మరీ పొత్తును కుదుర్చుకోగల సమర్థత చంద్రబాబుకు ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. సపోజ్... పవన్ కల్యాణ? తనకు ఖచ్చితంగా ముఖ్యమంత్రి పదవి అడుగుతారని భావిస్తే అందుకు తన వ్యూహాన్ని తాను ముందుగానే రచించుకుంటారు. ప్రిపేర్ అవుతారు. చివరకు ఐదేళ్లలో రెండున్నేళ్ల సీఎం పంచుకుందామన్న ప్రతిపాదన కూడా తెచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఎందుకంటే తమకు ముఖ్యమంత్రి పదవి ఈసారి దక్కాలని కాపులు తిష్టవేసి కూర్చున్నారు. హరిరామ జోగయ్య లాంటి నేతలు కూడా ఇప్పటికే బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు.కాపులకు ఒకసారి ముఖ్యమంత్రి పదవి ఇస్తే తప్పేంటి అన్న ప్రశ్న సహజంగానే ఆ సామాజికవర్గంలో నుంచి బలంగా వినపడుతుంది. పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే తమ కూటమి విజయానికి ఢోకా ఉండదని చంద్రబాబు కూడా భావించవచ్చు. పవన్ కల్యాణ్ ను భవిష్యత్ లో రాజకీయంగా తప్పించడం చంద్రబాబుకు సులువే. కానీ జగన్ స్ట్రాంగ్ అయి కూర్చుంటే కష్టమవుతుంది. అందుకే చంద్రబాబు ఈసారి ముఖ్యమంత్రి పదవి విషయంలో పూర్తి కాలం కాకపోయినా కొంత కాలం పవన్ కు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసే అవకాశముంటుందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. అలా జగన్ ను గద్దెదించడంతో పాటు తమ పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు చంద్రబాబు రాజీపడక తప్పదన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఎండిపోతున్న పైరులు

కడప, జనవరి 24, విద్యుత్ కోతలు రైతులకు కష్టాల వెతలను తెచ్చి పెడుతున్నాయి. వేళాపాలా లేని కోతలతో బోరుబావుల కింద సాగు చేసిన పంటలు ఎడిపోతున్నాయి. చేతికొచ్చిన పంటలు అందకుండా పోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. గత కొంతకాలంగా సత్యసాయి జిల్లా గుడిబండ మండలంలో నెలకొన్న ఈ విద్యుత్ సమస్యలు రైతుల జీవితాలను అప్పుల్లోకి నెట్టేస్తున్నాయి. గుడిబండ మండల వ్యాప్తంగా రాళ్లపల్లి, శంకరగల్లు, ఎస్.రాయాపురం, కొంకల్లు, కెఎన్.పల్లి, కరికెర, మందలపల్లి, సిసి.గిరి తదితర పంచాయతీల పరిధిలో వేలాది ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి, వరి, వక్క, తమలపాకు, అరటి, మల్బరీ తదితర పంటలను రైతులు సాగు చేశారు. బోరుబావుల కింద సాగువుతున్న ఈ పంటలకు నీటి తడులు అత్యవసరం. నిబంధనల మేరకు వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వాల్సి ఉండగా మండలంలో ఆరు గంటలు మాత్రమే ఇస్తున్నారు. అది కూడా ఎప్పుడు వస్తోందో తెలియని పరిస్థితి నెలకొంది. సమయ పాలన లేకపోవడంతో కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో రైతులకు తెలియడం లేదు. అవసరమైన సమయంలో పంటలకు నీటితడులు అందక అవి ఎండిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్లో పెట్టిన పంటలు వర్షాభావంతో చేతికందకుండా పోయాయి. దీంతో రైతులు రబీలో బోరుబావుల కింద సాగు చేసిన పంటలపై దృష్టి సారించారు. ఈ సీజన్‌లో అయినా పంటలు చేతికందుతాయని భావించిన రైతులకు విద్యుత్ కోతలతో నిరాశే మిగులుతోంది. నీళ్లులేక కళ్లేదుటే పంటలు ఎండిపోతున్నా ఏమీ చేయలేని స్థితిలో రైతులు ఉన్నారు. గుడిబండకు పక్కన ఉన్న మండలాల్లో తొమ్మిది గంటలు విద్యుత్ ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఆరు గంటలు కూడా ఇవ్వడం లేదు. ఈ విషయంపై పలుమార్లు రైతులు విద్యుత్ అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకుండా ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వకుంటే ఈ సారి పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గుడిబండ మండలంలో

విద్యుత్ కోత వాస్తవమే. ఆరు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతోంది. మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ లేని కారణంగా పక్కన ఉన్న మూడు సబ్‌స్టేషన్ల ద్వారా మండలానికి విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉంది. ఈ కారణంగా గుడిబండలో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాలో లోపం ఉంది. ఈ సమస్య పరిష్కారానికి అదనంగా మరో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మొదటి దశలో రాళ్లపల్లి, హిరేతూర్పి గ్రామాలకు సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయి. ఆ పనులు త్వరలోనే ప్రారంభించి ఆ పంచాయతీ పరిధిలోని రైతులకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తాం. మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలోనే విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

# లోకేష్ యాత్రకు అనుమతి.. కండిషన్స్ అప్లై



విజయవాడ, జనవరి 24, (న్యూస్ పల్స్) 27వ తేదీ నుంచి నారా లోకేష్ ప్రారంభించనున్న యువగళం పాదయాత్రకు పోలీసుల నుంచి ?నుమతి లభించింది. కుప్పం నుంచి ఇచ్చాపురం వరకూ జరిగే పాదయాత్రకు అనుమతి ఇస్తున్నట్లుగా చిత్తూరు ఎస్పీ ప్రకటించారు. నిబంధనలకు లోబడి పాదయాత్ర జరగాలని పోలీసులు స్పష్టం చేశారు. పాదయాత్రలో ఎక్కడ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని షరతు విధించారు. దీంతో పాదయాత్రకు అనుమతి లభిస్తుందా లేదా అన్న సస్పెన్స్ కు తెరపడినట్లయింది. 27 వ తేదీన కుప్పం నుంచి లోకేష్ పాదయాత్ర ప్రారంభం అవుతుంది.ఈ నెల 27నుంచి రాష్ట్రంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభం కానుంది...40 రోజుల క్రితమే లోకేష్ పాదయాత్ర చేయనున్నట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి..రాష్ట్రలో ఉన్న వివిధ వర్గాల ప్రజల సమస్యలను ఫోకస్ చేస్తూ పాదయాత్ర సాగనుందని తెలిపారు..పాదయాత్రకు యువగళం అన్న పేరును ఖరారు చేశారు. 400 రోజులు 4వేల కిలోమీటర్లు ఈ పాదయాత్ర సాగనుంది. జనవరి 27న కుప్పంలో ప్రారంభమయ్యే ఈ యువగళం పాదయాత్ర ఇచ్చాపురంలో పూర్తి ఆవుతోంది. పాదయాత్ర తేదీ దగ్గర పడటంతో నాయకులు క్యాడర్ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. పాదయాత్ర కు అనుమతి కావాలంటూ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఈ నెల 9న ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి లేఖ రాశారు. స్పందించక పోవడంతో రెండు సార్లు రిమైండర్ కూడా పంపారు. 21 వ తేదిన డీజీపీ స్పందిస్తూ ప్రత్యుత్తరం పంపారు . 400 రోజులపాటు లోకేష్ చేపట్టనున్న యువగళం పాదయాత్రకు సంబధించి డీజీపీ అడిగిన వివరాలు ... నాలుగు వందల రోజులకు సంబంధించి ప్రతి రోజు ఎవరెవరు పాదయాత్రలో పాల్గొంటారు..? లోకేష్ ను కలుసుకునే వ్యక్తుల వివరాలు వారి ఆధార్ కార్డు తో సహా సమర్పించాలి అని లేఖలో ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాదయాత్రలో ఉండే వాహన కాన్వాయ్ వివరాలు... వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్ తో సహ వివరాలు...రూట్ మ్యాప్ ఏ బజారు నుంచి ప్రారంభమై ఎక్కడ ఆ రోజు ముగుస్తోందో 400 రోజలకు సంబంధించిన వివరాలు... ఏ సమయంలో ఏ ప్రాంతంలో యాత్ర సాగుతోందో తేదీల వారిగా వివరాలు... ప్రతి రోజు బస చేసే ప్రాంతం ..ఎక్కడ నైట్ స్టే అవుతారో తెలియచేస్తూ స్థానికంగా ఆ బాధ్యతలు చూసే వారి ఫోన్ నెంబర్లు అందచేయాలని లేఖలో ప్రస్తావించారు. ఈ వివరాలన్నీ ఇవ్వడం సాధ్యం కాదని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. అనుమతి ఇచ్చినా ఇవ్వకపోయినా.. పాదయాత్ర జరిగి తీరుతుందని.. తమది ప్రజాస్వామ్య హక్కు అంటున్నారు. ఈ క్రమంలో చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి.. అనుమతి ఇస్తున్నట్లుగా చెప్పడంతో టీడీపీ శ్రేణులు ఇక అడ్డుకోరన్న ఉద్దేశంతో ఉన్నాయి. పాదయాత్రను భారీ ఎత్తున విజయవంతం చేసుకోవడానికి లోకేష్ చాలా రోజులుగా కసరత్తు చేస్తున్నారు. కొన్ని వేల మంది ని నేరుగా కలిసి మద్దతు అడిగారు. ఆయనతో పాటు నడిచేందుకు కార్యకర్తలు కూడా సిద్ధమయ్యారు.

## సందెట్లో సడేమియా లాగా పోలీసుల హెల్మెట్ ఫోటోలు

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం క్రాస్ రోడ్ లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాక సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జన సందోహంలో ప్రధాన రహదారిలో వాహనాలకు సందెట్లో సడే మియా లాగా ఇదే అవకాశం అని గంగాధర పోలీస్ స్టేషన్ లోని ఓ కానిస్టేబుల్ వాహనదారుల హెల్మెట్ ఫోటోలు తీయడమే పనిగా పెట్టుకుని వందలాది ఫోటోలు తీసే పనిలో పడ్డాడు. భద్రత ఏర్పాట్లకు వచ్చిన పోలీసులు ఓవైపు ఏర్పాట్లు చేస్తూనే ఓవైపు పెద్ద సంఖ్యలో జనాలు వస్తున్న తీరును గమనించి వాహనదారుల హెల్మెట్ ఫోటోలను తీయడాన్ని పలువురు వాహనదారులు యువకులు వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం కొరకు ఫోటోలు తీసినట్టుగా కనిపించిందని యువకులు వాపోయారు. మల్యాల మండలంలోని కొండగట్టు పుణ్యక్షేత్రంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహిని వాహన పూజకు వస్తున్న సందర్భంగా గంగాధర మండల కేంద్రంలోని క్రాస్ రోడ్ వద్ద గజమాలతో జనసేన యువకులు స్వాగతం పలకడానికి వేలాది మంది వచ్చారు. ఈ క్రమంలో గంగాధర ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లను నిర్వహించారు. వేలాది మంది వాహనాలు యువకులు, కార్యకర్తలు వస్తున్న తీరును గమనించిన ఓ పోలీస్ హెల్మెట్ ఫోటోలను తీయడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. సందర్భం ఏదైనా ఆదాయానికి పోలీసుల తాపత్రయం చూసిన యువకులు వాపోయారు.

### గురజాల మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్ ప్రమాణ స్వీకారం
### హాజరయిన మంత్రి రజని

పల్నాడు పల్నాడు జిల్లా గురజాల మార్కెట్ యార్డ్ లో మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని పాల్గొన్నారు. అనంతరం మంత్రి రజని మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర రాష్ట్రం అభివృద్ధిలో కానీ విని ఎరుగని రీతిలో ముందుకి దూసుకుపోతుందని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు చేయలేని పనిని వైసిపి పార్టీ ముందుకు తీసుకు పోతున్నామని చూసి టిడిపి ఓర్చుకోలేకపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్ రెడ్డి అన్న గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో తీర్చి దిద్దుతున్నారని అన్నారు. ఈరోజు ఒక దళితుడికి కనివిని ఎరుగని రీతిలో చరిత్ర లో లేని విధంగా గురజాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది అన్నారు

## గోమాతకు శ్రీమంతం

మచిలీపట్నం మచిలీపట్నం చింతగుంట పాలెం లో తెలుగు రైతు పిప్పళ్ళ వెంకట కాంతారావు ఇంటి వద్ద సంప్రదాయ సిద్ధంగా గోమాతకు శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు. గోమాతను దైవంగా భావిస్తూ వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేదపండితులు గోమాతకు అర్చనలు నిర్వహించారు. చింతగుంట పాలెం లో గో ప్రేమికులు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, తలారి సోమశేఖర్, లంక శెట్టి నీరజ, పాలపర్తి పద్మ , కార్పోరేటర్లు మరకాని సమతా కీర్తి, దేవరపల్లి అనిత తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ స్వయంగా గోమాతకు అర్చనలు నిర్వహించారు. మహిళలు గో ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం మచిలీపట్నం నగరంలో ఒక ప్రత్యేకత సంతరించుకుంది.హిందూ సంప్రదాయానికి అద్దం పట్టింది గోమాతను ప్రత్యక్షదైవంగా భావించాలని హిందూ ధర్మాన్ని కాపాడాలని ఈ సందర్భంగా గో ప్రేమికులు పేర్కొన్నారు.

## డివైడర్ ను ఢీకొన్న కారు..మహిళ మృతి

నెల్లూరు కావలి రూరల్ మండలం జాతీయ రహదారిపై గౌరవరం వద్ద ఒక కారు రోడ్డు డివైడర్ను ఢీకొట్టింది. ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. మృతురాలు డీవీ సత్రం తనియాలి గ్రామ మాజీ సర్పంచ్ సంచి రవణమ్మ (60)గా గుర్తించారు. హైదరాబాదు నుండి ఉమ్మడి నెల్లూరు జిల్లా దొరవారి సత్రం (మం )తనియాలి వెళుతుండగా ఘటన జరిగింది. ప్రమాద సమయంలో కారులో ఐదు మంది వున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

## చచ్చిపోతాను అనుమతి కల్పించండి

### వారు పెట్టె బాధను తట్టుకోలేక పోతున్నాను 85 వృద్ధుడి ఆవేదన

గుంటూరు కన్న బిడ్డలే కాల యముడులై ఆస్తులకోసం కన్న తండ్రిని నిత్యం కొడుతూ చంపడానికి చూస్తున్నారంటూ (85) తండ్రి గుంటూరు ఎస్పీని ఆశ్రయించిన దయనీయ ఘటన గుంటూరులో వెలుగు చూసింది. కోట్ల రూపాయల ఆస్తులను సనీపాదించాను. ఆ డబ్బును, ఆస్తులను ఇవ్వాలని నిత్యం కొడుతున్నారంటూ మహబూబ్ ఖాన్ (85) కన్నీటి పర్యంతరం అవుతున్నాడు. అయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చివరకు నా మూలంగా కుమార్తె కూడా నా కొడుకుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. గతంలో బంగారం వ్యాపారం , పొగాకు వ్యాపారం చేసాను. నాకు నా కుమార్తెకు రక్షణ కల్పించండి అయ్యా.. లేకపోతే ఆత్మహత్య చేసుకొనే అవకాశం కల్పించండి అంటూ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. అరే బడ్డే (ముసలోడా) నువ్వు ఎక్కడికి పోయినా ఏమి చెయ్యలేవు అంటూ కొడుకులు బెదిరిస్తున్నారని వృద్ధుడి ఆవేదన వ్యక్తం చేసాడు.బిడ్డలు విచక్షణా రహితంగా కొడుతున్నారంటూ, పొరుగువారు వచ్చి సర్దుబాటు చేయడానికి వస్తే వారినికుడా రావద్దంటు హుకుం జారి చేస్తారంటు ఆవేదన వ్యక్తం చేశారు. నేను బంగారం వ్యాపారం చేసే రోజుల్లో ఇతర దేశాల నుండి నాదగ్గరకు వచ్చి బంగారం కొనుగోలు చేసేవారు. వ్యాపారం నిజాయతీగా చేసాను. ఇప్పటి కూడా నాతో వ్యాపారం చేసిన వారు అందరు విదేశాల నుంచి ఫోన్ చేసి మాట్లాడతారు. నిజాయతీగా బ్రతికిన నాకు ఇలాంటి దుస్థితి ఏర్పడిందని వృద్దుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పోలీసులు తక్షణమే స్పందించాలని వేడుకుంటున్నాను అంటూ కన్నీటి పర్యంతం అయ్యారు.

## న్యాయం గెలవాలి..నిజం తేలాలి

### ఎంపీ అవినాష్ రెడ్డి

కడప గత రెండున్నర సంవత్సరాలుగా నాపై , నా కుటుంబం పై ఒక సెక్షన్ ఆఫ్ మీడియా అసత్యపు ఆరోపణలు చేస్తోందని ఎంపి అవినాష్ రెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించి సీబీఐ నోటీసుల పై అయన స్పందించారు. అవినాష్ రెడ్డి మాట్లాడుతూ నాపై వచ్చిన అభియోగాలు జీర్ణించుకోలేకపోతున్నా...నేనేమిటో నా వ్యవహార శైలి ఏమిటో ఈ జిల్లా ప్రజలకు అందరికీ బాగా తెలుసు. న్యాయం గెలవాలి. నిజం వెల్లడి కావాలా అన్నదే నా ధ్యేయం. మీడియా ముఖ్యంగా కోరుకుంటున్నా. నిజం తేలాలని నేను కూడా భగవంతుడు ని కోరుకుంటున్నానని అన్నారు.ఆరోపణ చేసేవారు మరొకసారి ఆలోచించాలి ఇలాంటి ఆరోపణ చేస్తే మీ కుటుంబాలు కూడా ఎలా ఫీల్ అవుతారో ఒకసారి ఊహించుకోండని అయన అన్నారు

# బద్వేలులో అవినీతి జలగలు ఎందరో....?



బద్వేలు , బద్వేలులో అవినీతి జలగలు లెక్కకు మించి ఉన్నారన్న ఆరోపణలు ఇప్పటికీ వినిపిస్తున్నాయి ముఖ్యమంత్రి ఆశయానికి తూట్లు పొడుస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు బద్వేలు గోపవరం మండలాల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఇదే పనిగా పెట్టుకున్నారు బద్వేల్ మండలంలో కొందరు విఆర్వోలు వీఆర్ఏలు అవినీతి దందా కొనసాగిస్తున్నారు బద్వేల్ మండలంలో పనిచేస్తున్న వీరు అన్ని విషయాల్లో ఆరితేరిపోయారు చెప్పాలి వీరి అవినీతి దందా అంతా ఇంతా కాదని చెప్పాలి వీరి అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయి ఇప్పటికీ వీరిపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి గతంలో బద్వేల్ లో నివాసం ఉంటూ కడపలో పనిచేస్తున్న వాణిజ్య పనుల శాఖ ఉప కమిషనర్ అక్రమాస్తులు బట్టబయలు అయ్యాయి ఆ ఘటన మరువక ముందే పంచాయతీ రాజ్ ఏఈ అక్రమాస్తులు కలిగి ఉండి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు అతని నుండి దాదాపు రెండు కోట్ల రూపాయలు విలువ చేసే అక్రమ ఆస్తులు అధికారులు స్వాధీనం చేసుకున్నారు ఆ తర్వాత అతన్ని అరెస్ట్ చేశారు ప్రతి పనికి కమిషన్ ఇస్తేనే సంతకాలు పెడతామని కొందరు అధికారులు పట్టు పడుతున్నారు బద్వేలు పంచాయతీరాజ్ శాఖలో ఇది మరింత అధికంగా ఉంది ఇలాంటి అధికారులు బద్వేల్ లోని ప్రతి ప్రభుత్వ శాఖలో ఉన్నారు ఏసీబీకి దొరకని అధికారులు ఎంతోమంది ఉన్నారు బద్వేలు సబ్ ట్రెజరీ సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై గతంలో ఏసీబీ అధికారులు పలుమార్లు దాడులు చేశారు సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడి ఆ తరువాత ఊచలు లెక్కించి ఉద్యోగాలు పోగొట్టుకున్నారు బద్వేల్ లో నివాసముంటు

## సాంకేతికత పెరిగిన తగ్గని అవినీతిముఖ్యమంత్రి ఆశయానికి తూట్లు

పక్కమండలంలో పనిచేస్తున్న ఒక తాసిల్దార్ ఏసీబీకి పట్టుబడి కొద్దిరోజులపాటు ఊచలు లెక్కించవలసిన దుస్థితి ఏర్పడింది ఆ ఉద్యోగి రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఏసీబీ కేసు అలాగే ఉండిపోయింది నాలుగు సంవత్సరాల క్రితం బద్వేలు ఎక్సైజ్ సి ఐ హిమబిందు బ్రాందీ షాపుల యజమాను నుండి 51 వేల రూపాయలు ముడుపులు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టు పడ్డారు ఆమె నెల రోజులు పాటు కర్నూలు జైల్లో ఖైదీగా ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది కొద్ది నెలలు గడిచిన తర్వాత కోర్టు ఉత్తర్వుల మేరకు మరో జిల్లాలో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు కాగా బద్వేలు నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు 50000 రూపాయలు ముడుపులు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ప్రత్యక్షంగా పట్టుబడ్డారు బద్వేలు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతికి అంతులేదు ఈ కార్యాలయం పై ఇప్పటికే నాలుగు సార్లు ఏసీబీ అధికారులు దాడులు చేశారు లెక్కలోకి రాని నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురిపై కేసు నమోదు చేశారు ఇప్పటికీ ఈ కార్యక్రమంలో ముడుపుల గొడవ కొనసాగుతూనే ఉంది ఇక పంచాయతీ రాజ్ కార్యాలయానికి సంబంధించి అవినీతి అంతా ఇంతా కాదు అధికారులు ప్రతి పనికి ఒక ధర నుంచి ముడుపులు దండుకోవడం ఇక్కడ రివాజుగా మారింది కొంతమంది అధికారులు సంవత్సరాలు తరబడి ఇక్కడే తిష్ట వేసి ముడుపులు దండుకుంటున్నారు అడ్డగోలు సంపాదనతో ఆదాయం నుంచి వీరి ఆస్తులు కోట్ల రూపాయలకు పడగలేస్తాయి వీరి ఆస్తులపై అధికారులు విచారణ జరిపిస్తే ఎన్నో విషయాలు వెలుగు చూస్తాయి అంతేగాక కొందరు ఏఈలు ఉన్నతాధికారులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి ఇస్తారాజ్యంగా సంపాదిస్తున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే ఇదే పద్ధతి బద్వేలు నీటిపారుదల శాఖలోను లేకపోలేదు ఇద్దరు అధికారులు కొంతమంది సిబ్బంది ఇస్తారాజ్యంగా వ్యవహారం నడుపుతూ కోట్లాది రూపాయలు సంపాదించినట్లు సమాచారం ఈ విషయాన్ని ఎవరిని అడిగినా ఇట్లే చెప్పేస్తారు బద్వేలులో కొందరు అవినీతి అధికారులపై వారు సంపాదన పై ఇప్పటికే కొందరు ఏసీబీ అధికారులకు లికిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఆ ఫిర్యాదులపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు సమాచారం అవినీతి లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పదేపదే చెబుతుంటే ఆయన సొంత జిల్లాలోనే ముడుపులు కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా దండుకుంటున్నారు వీరి అవినీతికి ఎప్పుడు చెక్కు పడుతుందో తెలియవలసి ఉంది

# ఆడపిల్లల ను ఎదగనిద్దాం...ఆకాశమే హద్దుగా ఎగరినిద్దాం.

**:- - - జనసేన వీర మహిళా సంగా జయంతి,**




నంద్యాల :- బాలికల దినోత్సవం సందర్భంగా జనసేన వీర మహిళా సంగా జయంతి మంగళవారం నాడు ఓ ప్రకటనలో మాట్లాడుతూ .. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు, స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదు. అందువల్ల ఆడ పిల్లలను రక్షించుకుందాం అమ్మాయిలను ఆదరిద్దాం, సృష్టిని కాపాడుకుందాం. అమ్మగా, సోదరిగా, భార్యగా, భవిష్యత్ తరాల కోసం.. ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.మనలో సగం మంది వెనకే ఉంటే సంపూర్ణ విజయం సాధించలేం. ప్రపంచవ్యాప్తంగా సోదరీమణులు ధైర్యంగా ముందుకొచ్చేలా మనం చెయ్యాలి. వారంతట వారు శక్తిని సంపాదించుకునేలా చెయ్యాలి. తమ శక్తి సామర్థ్యాలను వారు తెలుసుకునేలా చెయ్యాలి"ఉత్తమ సమాజాన్ని చూడాలన్నా, మంచి భవిష్యత్తు కనిపించాలన్నా,, రేపటి రోజులు బాగుండాలన్నా మనం చెయ్యాల్సింది బాలికలకు అవకాశాలు కల్పించడమే..ధైర్యం, త్యాగం, పట్టుదల, నిబద్ధత, రాటుదేలినతనం మనసు, నైపుణ్యం వంటి వాటితో బాలికలు తయారవుతారు. సమాజంలో కొంత మార్పు వచ్చినప్పటికీ ఇంకా దేశంలో ఎక్కడో ఒకచోట నిత్యం ఆడపిల్లలపై అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించినప్పుడే జాతీయ బాలిక దినోత్సవాన్ని సార్థకం చేసుకున్న వాళ్లమవుతాం. లింగ వివక్ష చూపడం అన్నది అనాగరిక భావన. ఇటువంటి ఆలోచనలకు స్వస్తి పలికితే అభివృద్ధి, ఆనందం రెండింతలు కాగలదు. ఈరోజు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా లింగ సమానత్వానికి కృషి చేస్తామని మనందరం ప్రతిజ్ఞచేద్దాం అని పిలుపునిచ్చారు .

# పెండింగ్ కేసుల పై . నేర సమీక్షా సమావేశం

**-- నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి.**



నంద్యాల :-నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ రఘువీర్ రెడ్డి ఐపిఎస్ గారు నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్ల వారీగా యు ఐ కేసులు తగ్గించుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు.హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ అగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 , తదితర కేసులను సమీక్ష చేశారు. అరెస్టులు, చార్జ్ షీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా చేయాలన్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను సిసిటి ఎన్ఎస్ లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. ఆయా కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు సూచించారు.హత్య కేసుల,పీఓ సీ కేసులు మరియు రేప్ కేసులలో దర్యాప్తు వేగాన్ని పెంచాలని, హత్య మరియు ఇతర కీలకమైన కేసుల్లో శాస్త్రీయ పద్ధతులలో దర్యాప్తు సమగ్రంగా చేపట్టాలని, మహిళల, చిన్నారుల అదృశ్యం కేసులలో ఏ విధమైన అలసత్వం చూపించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన వారిని పట్టుకొనుటలో నిబద్ధత చూపించాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేయాలన్నారు. బీట్లు, పికెట్స్ ఏర్పాటు చేసుకొని అధికారులు తరుచుగా బీట్ చెక్ చేస్తూ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు, తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలకు వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలను ఏర్పాటు చేసుకునే ప్రోత్సహించాలన్నారు.దొంగతనాలను అరికట్టేందుకు హైవే రహదారులపై వాహనాల తనిఖీలు చేస్తూ ప్రత్యేక చొరవ చూపాలని అలాగే లారీ అసోసియేషన్ వారితో మాట్లాడి కంటేనర్ భారీ వాహనాలకు సీ సీ కెమరాలు ఎర్పటు చేసుకోవాలని వివరించి అవగాహన కల్పించాలని మరియు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని పాపిలాన్ పరికరం ద్వారా వారి వేలి ముద్రలను తనిఖీ చేయాలి.రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వాహన తనిఖీలు చేపట్టి ఎం.వి.చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తూ, ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోన్ యాప్ ల మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా చైతన్యం చేయాలన్నారుచట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా మరియు విక్రయించే వారిపై యన్ డి పి . కేసులు నమోదు చేయాలన్నారు.గంజాయి రవాణా పై ప్రత్యేక దృష్టి సారించి ఎం.డి.పీ.ఎస్. కేసులను డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షించాలి. వీటిని అరికట్టడం వల్ల చిన్న పిల్లలను మరియు యువతను కాపాడుకోగలుగుతాము.అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుని ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా వ్యవహరించాలి పూర్తిస్థాయిలో విచారణ దర్యాప్తు చేసి ఖచ్చితమైన ఆధారాలతో కోర్టుకు సమర్పించి బాధితులకు సరైన న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీగారితో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ .రమణ గారు,నంద్యాల టౌన్ డిఎస్పి మహేశ్వర్ రెడ్డి గారు, ఆళ్లగడ్డ డిఎస్పి సుధాకర్ రెడ్డి గారు , దిశ డిఎస్పి మారుతీరావు గారు , సిఐ లు ,ఎస్ఐ లు పాల్గొన్నారు.

# తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర నీతి అయోగ్ బృందం

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రోజున ఢిల్లీ నుండి వచ్చిన కేంద్ర నీతి అయోగ్ బృందం సందర్శించారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను వారు క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు,అలాగే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అలాగే ఆసుపత్రి ఆవరణం నందు పరిశుభ్రతను పరిశీలించారు.ప్రజల కోసం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ సర్వీస్ లను కూడా వారు పరిశీలించారు.గర్భవతులకు అందుతున్న వైద్య సేవలు నెలకు ఎంతమంది గర్భవతులు డెలివరీ అవుతున్నారనే విషయాలను అడిగి వారు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఢిల్లీ నుండి వచ్చిన సీనియర్ కన్సల్టెంట్ నీతి ఆయోగ్ డాక్టర్ సుమన్ అరోరా,కన్సల్టెంట్ నీతి అయోగ్ జైశ్రీ మిశ్రా,యంగ్ ప్రొఫెసర్ నీతి అయోగ్ శేష హాజర్ లు మాట్లాడుతూ తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చక్కగా వైద్య సేవలు అందుతున్నాయని,వివిధ రకాల సేవలకు సంబంధించి రికార్డులు కూడా క్రమ పద్ధతిలో ఉన్నాయన్న,ప్రసవాలు కూడా ఇచ్చిన టార్గెట్ ప్రకారం జరుగుతున్నాయని,ఆసుపత్రి చుట్టూ పరిసర పరిశుభ్రత చక్కగా ఉన్నదని,బిల్డింగ్ కూడా బాగా ఉన్నదని తెలిపారు.ఇలాగే దేశవ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అదేవిధంగా కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని వారు తెలిపారు. ఇప్పటిలాగే స్థానిక వైద్యులు నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్రహ్మణ్యం,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామ్ గిడ్డయ్య,డిపిఎమ్ఓ డాక్టర్ ఉమా, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయ రాజు,తుగ్గలి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్,స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సల్మాన్ చిత్రం కోసం అభిమానుల ఎదురుచూపు



సల్మాన్ ఖాన్‌ను గత రెండేళ్లుగా వరుస ఫ్లాపులు ఇబ్బంది పెడుతున్నాయి. నిజానికి గతేడాది సల్మాన్ నుండి ఒక్క సినిమా కూడా రాలేదు. ఆ ముందటి ఏడాది రెండు సినిమాలు విడుదల కాగా.. రెండూ నిర్మాతలకు తేరుకోని నష్టాల్ని మిగిల్చాయి. దాంతో సల్మాన్ కొంచెం గ్యాప్ తీసుకుని రెండు సినిమాలతో అభిమానులలో ఉత్సాహం నింపడానికి రెడీ అయ్యాడు. సల్మాన్ ప్రస్తుతం రెండు సినిమాలు సెట్స్‌మీద ఉంచాడు. అందులో 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' ఒకటి. ఈద్ సందర్భంగా ఏప్రిల్ 4న ఈ మూవీ రిలీజ్ కానుంది. అయితే ఇప్పటి వరకు ఈ సినిమాకు సంబంధించిన మేజర్ అప్‌డేట్ ఒక్కటి కూడా ఇవ్వలేదు. దాంతో అభిమానులు చిత్రబృందం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా తాజాగా సల్లూ భాయ్ అభిమానులకు అదిరిపోయే న్యూస్ చెప్పాడు. ఈ సినిమా టీజర్‌ను రిపబ్లిక్‌డే కానుకగా ఒకరోజు ముందే రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించాడు. ఈ మేరకు స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశాడు. ఈ ప్రకటనతో సల్మాన్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఫర్హాద్ సమ్‌జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుంది. టాలీవుడ్ అగ్ర నటుడు వెంకటేష్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా తమిళంలో సూపర్ హిట్టయిన వీరమ్‌కు రీమేక్‌గా తెరకెక్కుతుంది. తెలుగులో వీరుడొక్కడే పేరుతో డబ్బింగ్ అయింది. సల్మాన్ ఖాన్ తన సొంత బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. జగపతిబాబు కీలకపాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు దేవి ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తు?న్నాడు

# మైఖేల్ విజయంపైనే సందీప్ ఆశలు

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ కమర్షియల్ హీరో గుర్తింపు కోసం ఎంతో ప్రయత్నిస్తున్నాడు. కెరీర్ బిగెనింగ్ నుండి విభిన్న సినిమాలు చేస్తున్నా కమర్షియల్ హీరోగా గుర్తింపు తెచ్చుకోలేకపోతున్నాడు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'బీరువా', 'ఏ1 ఎక్స్‌ప్రెస్' వంటి పలు సినిమాలు కమర్షియల్‌గా మంచి విజయాలే సాధించినా.. సందీప్‌కు మాత్రం స్టార్ స్టేటస్ తెచ్చిపెట్టలేకపోయాయి. ఈ క్రమంలో రెండేళ్ల గ్యాప్ తీసుకుని 'మైఖేల్' వంటి పాన్ ఇండియా సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యాడు. రంజిత్ జయంకోడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, టీజర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమ ట్రైలర్ రిలీజైంది.లేటెస్ట్‌గా రిలీజైన ట్రైలర్ గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ట్రైలర్ మొత్తం యాక్షన్ సన్నివేశాలతో నిండిఉంది. అయితే ట్రైలర్‌లో ఎక్కువగా ఏమి రివీల్ చేయలేదు. కానీ హీరోయిన్ చుట్టూ ఈ సినిమా కథ జరుగుతుందని స్పష్టంగా తెలుస్తుంది. మరి హీరోయిన్ ఎవరు? అసలు హీరోయిన్‌కు ఏమైంది? హీరోయిన్ కోసం సందీప్ గ్యాంగ్‌స్టార్‌గా ఎందుకు మారాల్సి వచ్చింది? అనే పలు విషయాలను సస్పెన్స్‌లో పెట్టారు. విజయ్ సేతుపతి క్యారెక్టర్ పవర్ ఫుల్‌గా ఉండనున్నట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తుంది.




గౌతమ్ మీనన్ ఇంటెన్సీవ్ పాత్రలో నటిస్తున్నాడు. ఇక వరుణ్ సందేష్ కొత్తగా కనిపిస్తున్నాడు. వరలక్ష్మీ క్యారెక్టర్ కూడా స్టాం÷-రగ్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తంగా ఒక్క ట్రైలర్‌తో ఎక్కడ లేని అంచనాలు క్రియేట్ అయ్యాయి.ఫీమేల్ క్యారెక్టర్‌లకు ఈ సినిమాలో మంచి ఇంపా÷-టగ్గ÷న్స్ ఉన్నట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతుంది. లవ్ కమ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా ఫిబ్రవరి 3న పాన్ ఇండియా లెవల్లో రిలీజ్ కాబోతుంది. సందీప్‌కు జోడీగా దివ్యాంశ కౌశిక్ నటిస్తుంది.

# 75వ సినిమాను ప్రకటించిన వెంకటేశ్

ఎట్టకేలకు వెంకటేష్ తన 75వ సినిమాను ప్రకటించేశాడు. గతకొన్ని నెలలుగా వెంకటేష్ 75వ సినిమా గురించి ఎన్నో రకాల చర్చలు. ఎంతో మంది దర్శకులు పేర్లు. మొదటగా అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ పేరు వినిపించింది.ఆతర్వాత త్రినాథ్ రావు నక్కిన, తేజ, అనీల్ రావిపూడి అనిచాలామందిపేర్లు వినిపించాయి. కానీ అవిపేర్లవరకే పరిమితమైపోయాయి. ఒకనొక దశలో వెంకీమామా సినిమాలకు గుడ్‌బై పెట్టనున్నాడా అనే డౌట్స్ కూడా చాలా మందిలో వచ్చాయి. అయితే తాజాగా వాటికి వెంకీమామా ఫుల్‌స్టాప్ పెడ్డాడు. గతకొన్ని రోజులుగా వెంకటేష్ తన తదుపరి సినిమాను సైలేష్ కొలను దర్శకత్వంలో చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా వాటిని నిజం చేస్తూ మేకర్స్ తాజాగా ప్రీలుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.ఈపోస్టర్‌లోవెంకీచేతిలో ఏదో పట్టుకుని ఉన్నాడు. అదేంటో తెలియాలంటే జనవరి 25 వరకు వేచి చూడాల్సిందే అంటున్నారు మేకర్స్.గతకొన్నేళ్లుగావెంకటేష్‌కామెడీసినిమాలపై ఫోకస్ పెడు తూ..మాస్ సినిమాల వంక కూడా చూడలేదు. కాగా చాలా కాలం తర్వాత ఈ సినిమాలో మాస్ చొక్కా ధరించనున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన పూర్తి విషయాలు జనవరి 25ను వెల్లడికానున్నాయి



# ఎట్టకేలకు వాళ్లిద్దరికి ఛాన్స్.. సిరాజ్, షమీ అవుట్

న్యూజిలాండ్‌తో ఆఖరిదైన నామమాత్రపు మూడో వన్డేలో టీమిండియా రెండు మార్పులతో బరిలోకి దిగింది. పేసర్లు మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్‌కు రెస్ట్ ఇచ్చిన మేనేజ్‌మెంట్..ఉమ్రాన్ మాలిక్, యజువేంద్ర చహల్‌కు తుది జట్టులో చోటిచ్చింది. కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు.కాగా గత రెండు మ్యాచ్‌లలో ఉమ్రాన్ మాలిక్, చహల్‌కు బెంచ్‌కే పరిమితమైన సంగతి తెలిసిందే. ఇక ఇప్పటికే సిరీస్ కోల్పోయిన పర్యాటక కివీస్ మంగళవారం నాటి ఇండోర్ వన్డేలో టాస్ గెలిచి తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ సందర్భంగా కెప్టెన్ టామ్ లాథమ్ మాట్లాడుతూ.. "మేము తొలుత బౌలింగ్ చేయాలనుకుంటున్నాం. పిచ్ పాతబడే కొద్దీ బ్యాటింగ్‌కు మరింత అనుకూలిస్తుంది.చిన్న గ్రౌండ్ కాబట్టి భారీ స్కోర్లు నమోదు కావడం ఖాయం. ఇక్కడ మేము మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటున్నాం" అని పేర్కొన్నాడు. జాకోబ్ డఫీ స్థానంలో హెన్రీ షిప్లేను ఆడిస్తున్నామని.. తమ జట్టులో ఇదొక్కటే మార్పు అని తెలిపాడు.

టీమిండియా:రోహిత్ శర్మ(కెప్టెన్), శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చహల్, ఉమ్రాన్ మాలిక్.

న్యూజిలాండ్

ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే, హెన్రీ నికోల్స్, డారిల్ మిచెల్, టామ్ లాథమ్(వికెట్ కీపర్/కెప్టెన్), గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ బ్రాస్‌వెల్, మిచెల్ సాంట్నర్, లాకీ ఫెర్గూసన్, జాకోబ్ డఫీ, బ్లేయర్ టిక్నర్

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**